# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ 18వ లోక్ సభ సమావేశాలు రేపు ఉదయం ప్రారంభం కానున్నాయి.
- ❖ రోడ్డు ప్రమాదాల రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.
- ❖ రాష్ట్రంలో 18 మంది ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.
- ❖ ఈనెల 23 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్ ఎక్స్ ప్రెస్ తో పాటు పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేరు డివిజన్ అధికారులు తెలియజేశారు.

===========================

18వ లోక్ సభ తొలిసారిగా రేపు సమావేశం కానుంది. ప్రొటెం స్పీకర్ గా నియమితులైన భారతీయ జనతాపార్టీ సీనియర్ లోక్ సభ సభ్యులు భర్తృహరి మెహతాబ్ నూతనంగా ఎన్నికైన లోక్ సభ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా ఈ నెల 26 తేదీన లోక్ సభ స్పీకర్ ఎన్నిక జరుగనుండగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 27న లోక్ సభ, రాజ్యసభ సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తారు. ఈ నెల 27 నుంచి రాజ్యసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. జులై 3వ తేదీతో పార్లమెంట్ సమావేశాలు ముగియనున్నాయి.

===========================

రోడ్డు ప్రమాదాల రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతామని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన సర్వీసుల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అందుకు తగ్గట్టుగా రాష్ట్రంలో రహదారుల స్థితిగతులను మెరుగు పర్చడంతో పాటు ఆర్టీసి డ్రైవర్లకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈరోజు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రకాశం జిల్లా దర్శిలో 18.51 కోట్ల రూపాయలతో డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన సంస్థను ఏర్పాటు చేసే దస్త్రంపై తొలి సంతకం చేశారు. అదే విధంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని మహిళలు అందరికీ ఏపీఎస్ఆర్టీసి బస్సుల్లో

ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని త్వరలోనే కల్పిస్తామని అన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మానసిక ఉల్లాసాన్ని శారీరక దారుఢ్యాన్ని పెంపొందించే క్రీడలు యువతకు ఎంతో అవసరమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పని చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిను ఈరోజు ఆయన సందర్శించి డయేరియాతో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అనంతరం జగ్గయ్యపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో డయేరియాపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, డయేరియా బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని, కాచి వడపోసిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. దీర్ఘకాలిక ప్రణాళికపైనా దృష్టి సారిస్తున్నామని మంత్రి వివరిస్తూ.....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో 18 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మిని గుంటూరు జిల్లాకు బదిలీ చేయగా, బి ఆర్ అంబేద్కర్ ను విజయనగరం జిల్లా కలెక్టర్ గా నియమించారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్‌ను అల్లూరు సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. కాకినాడ జిల్లా కలెక్టర్ గా ఎస్. షన్మోహన్ ను నియమించారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లిఖార్జునను సాధారణ పరిపాలనా విభాగానికి రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ... సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ కు అధనపు బాధ్యతలు కేటాయించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలోని నిడదవోలు - కడియం రైల్వేలైన్ ఆధునీకరణ పనుల కారణంగా ఈనెల 23 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేరు డివిజన్ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు రాజమండ్రి - విశాఖ ప్యాసింజర్, గుంటూరు - విశాఖ సింహాద్రి ఎక్స్ ప్రెస్, విజయవాడ - విశాఖ రత్నాచల్ ఎక్స్ ప్రెస్, గుంటూరు- విశాఖ ఉదయ్ ఎక్స్ ప్రెస్, విశాఖ- తిరుపతి డబుల్ డెక్కర్ ఎక్స్ ప్రెస్ జత రైళ్లను రద్దు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో రేపు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ అధికారి వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భూగర్భ డ్రైనేజి, తాగునీరు, రోడ్లు వంటి సమస్యలపై గుంటూరు నగరపాలక సంస్థ అధికారులతో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి పనులు గత ప్రభుత్వంలో ఆగిపోయాయని తెలిపారు. త్వరలోనే నిధుల్ని సమీకరించి ఆ పనులన్నింటిని ప్రారంభిస్తామని వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడవనుందని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని ఈరోజు హోం మంత్రి దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా హోం మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. హోంశాఖ అత్యంత వేగంగా పని చేస్తుందని.. ఇటీవల చీరాలలో చోటుచేసుకున్న అత్యాచార ఘటనలో 36 గంటల్లోనే నిందితులను పట్టుకున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మాదక ద్రవ్యాలు, గంజాయి నిర్మూలకు కృషి చేస్తామని మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలో 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఇసుక అందుబాటులో లేకపోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. కాకినాడలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... ఇసుక అందుబాటులోకి తెచ్చి కార్మికులకు జీవనోపాధిని కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. చంద్రన్న భీమా సాయాన్ని 10 లక్షల రూపాయలకు పెంచామని, దీనివల్ల ప్రమాదాలకు గురయ్యే కార్మికుల కుటుంబాలకు చేయూత లభిస్తుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సీనియర్ పాత్రికేయులు బి.మురళీధర్ రెడ్డి మృతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. పలు పత్రికల్లో బి.మురళీధర్ రెడ్డి ఎంతో సమర్ధవంతంగా పనిచేశారని చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీతో పాటు శ్రీలంక, పాకిస్థాన్ లో కూడా కరస్పాండెంట్ గా పని చేసిన మురళీధర్ రెడ్డి రిపోర్టింగ్ లో తనదైన ముద్ర వేశారన్నారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =